

ఎస్‌ఐ అభ్యర్థులకు 8 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం

పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన ఎస్‌ఐ పోస్టుల నియామకాలకు విశాఖపట్నం రేంజ్ పరిధిలో ఎంపికైన సివిల్, ఎపిఎస్‌పి, ఆర్‌ఎస్‌ఐ అభ్యర్థులు ఈనెల 8, 9తేదీల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని విశాఖ రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ తెలిపారు. ఆ రెండు రోజులూ ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5గంటల మధ్య విశాఖరేంజ్ పోలీసు కార్యాలయానికి హాజరు కావాలని తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో వచ్చి అటెస్టేషన్ ఫామ్స్ నింపి, తదుపరి ఉత్తర్వులు స్వీకరించేందుకు హాజరుకావాలని తెలిపారు.



విజయనగరం : కలెక్టరేట్ వద్ద ఎస్మా చట్ట జిఒను దగ్ధం చేస్తున్న నాయకులు

ఎస్మాపై భగ్గుమన్న అంగన్వాడీలు

● పలుచోట్ల జిఒ కాపీలు దగ్ధం ● వినూత్న నిరసనలు ● కలెక్టరేట్ వద్ద రిలే నిరాహారదీక్షలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

అంగన్వాడీల సమ్మెను నిషేధానికి ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తూ జారీ చేసిన జీవో 2పై అంగన్వాడీలంతా భగ్గుమన్నారు. జీవో కాపీలను పలుచోట్ల దహనం చేశారు. మరోవైపు వేతనాల్లో కోత విధించడాన్ని తీవ్రంగా ఖండించారు. పండగ పూట కూడా తమ కడుపుమాడ్చే చర్యలపై మండిపడ్డారు. ఎస్మా ప్రయోగించినా తగ్గేదిలేదనిప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లా అంతటా వినూత్న నిరసనలు చేపట్టారు.

ఐసిడిఎస్‌ను బలోపేతం చేసి అంగన్వాడీలను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 26వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా శనివారం నుంచి కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ ల సమ్మెను నిషేధిస్తూ ఎస్మాను ప్రయోగిస్తూ జారీ చేసిన జీవోను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు వి.లక్ష్మి, అధ్యక్ష, కార్యదర్శులు పైడిరాజు, అనసూయ మాట్లాడుతూ ప్రభుత్వ శాశ్వత ఉద్యోగుల పై ఎమర్జెన్సీ కాలంలో ప్రయోగించిన చట్టాన్ని అంగన్వాడీ కార్యకర్తలపై ప్రయోగించడం సిగ్గు చేటన్నారు. అంగన్వాడీలకు ఎస్మా చట్టం వర్తించదన్న వాస్తవం ఈ ప్రభుత్వ సన్నాసులకు తెలియకపోవడం సిగ్గుసిగ్గు అన్నారు. భయపెట్టే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తే తగిన ఫలితం అనుభవిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు టివి రమణ, రెడ్డి శంకరరావు, బి.రమణ, బి.సుధారాణి అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

జగన్ పాలిట భద్రకాళీ

గజపతినగరం : సమ్మె శిబిరంలో భద్రకాళి వేషధారణతో అంగన్వాడీలు నిరసన తెలిపారు. గొబ్బెమ్మలు పెట్టి రామణాచందనాల అనే పాట పాడి వాటి చుట్టూ ప్రదర్శన చేశారు. అలాగే సంక్రాంతి పండగ ఇక్కడే చేసుకోవాలా ముఖ్యమంత్రి గారు అంటూ ప్రశ్నిస్తూ చింతపండు ఇటుకతో ఇత్తడి సామాన్లను తోముతూ నిరసన తెలిపారు. అనంతరం జీవో 2 కాపీలను దగ్ధం చేశారు. ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సుభాషిని, రాములమ్మ, వాణి, రేణుక, దమయంతి, నరసమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : ఎన్‌టిఆర్ విగ్రహం జంక్షన్ వద్ద అంగన్వాడీలు మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి, రోజా, అనురాధ, ఉమాగౌరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎస్మాను ప్రయోగిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 2 కాపీలను దగ్ధం చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు మాట్లాడుతూ ఎస్మా చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జగన్ మామా మా టీచర్ల న్యాయం చేయండి

రామభద్రపురం : జగన్ మామా మా అంగన్వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించి కేంద్రాలను తెరిపించండి అంటూ సమ్మె శిబిరంలో చిన్నారులు కోరారు. సిఐటియు నాయకులు బలస శ్రీనివాసరావు మాట్లాడుతూ డిమాండ్లు పరిష్కరించి సమ్మె విరమింప జేయాలని కోరారు.

రాజాం : సమ్మెపై ఎస్మాను ప్రయోగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ జీవో కాపీని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ ,రామ్మూర్తి నాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సత్యవతి, శ్రీదేవి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం : అంగన్వాడీల సమ్మెను నిషేధిస్తూ ప్రభష్త్వం జారీ చేసిన జీవో2ను అంగన్వాడీలు తగులబెట్టారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారని యూనియన్ నాయకులు కృష్ణవేణి, సిఐటియు జిల్లా కార్యదర్శి బి సూర్యనారాయణ మండిపడ్డారు. యూనియన్ నాయకులు కొర్లమ్మ, శ్రీదేవి, ప్రవీణ, అనిత పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 26వ రోజుకు చేరింది. తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఒంటి కాలుపై నిల్చొని దండాలు పెడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మద్దిల రమణ మాట్లాడారు. యూనియన్ నాయకులు డి.శ్యామల, భారతి, వి.హేమ, డి.జగదీశ్వరి, రమణి తదితరులు పాల్గొన్నారు.

జామి : తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన శిబిరంలో కార్యకర్తలు పలు ఆటలతో నిరసన తెలిపారు. ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడంపై మండిపడ్డారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కరించాలని లేదంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గాడి అప్పారావు, యూనియన్ నాయకులు కనకమహాలక్ష్మి, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎస్.కోట : ఒంటికాళ్లపై నిల్చొని దండాలు పెడుతూ నిరసన



గజపతినగరం : జగన్ పాలిట భద్రకాళిలమవుతామంటూ నిరసన



రామభద్రపురం : సమ్మె శిబిరంలో పాల్గొన్న చిన్నారులు



భోగాపురం : జిఒ 2 కాపీలను దహనం చేస్తున్న అంగన్వాడీలు, సిఐటియు నాయకులు



బొబ్బిలి : మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

చింతపల్లిలో శాశ్వత ఫిషింగ్ జెట్టీ ఏర్పాటు

కేంద్ర మత్స్యశాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాల

ప్రజాశక్తి-పూసపాటిరేగ

చింతపల్లిలో శాశ్వత ఫిషింగ్ జెట్టీ ఏర్పాటు చేస్తామనికేంద్ర మత్స్యశాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాల తెలిపారు. కేంద్రం మత్స్యకారుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పలు పథకాలు వారికి ఏవిధంగా చేరుతున్నాయనే అంశాన్ని పరిశీలించే లక్ష్యంతో చేపట్టిన సాగర పరిక్రమలో భాగంగా చింతపల్లిలో కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాల, సహాయ మంత్రి ఎల్.మురుగన్‌లు శనివారం పర్యటించారు. సముద్రతీరంలో చేపలు విక్రయిస్తున్న మహిళలతో మాట్లాడి వాటి విక్రయం ద్వారా ఎంత ఆదాయం వస్తుందని ఆరా తీశారు. మత్స్యకార ప్రతినిధులు, లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు బర్రి చిన్నప్పన్న, రాము తదితరులు తమ ప్రాంతానికి ఫ్లోటింగ్ జెట్టీ కాకుండా శాశ్వత స్థాయి జెట్టీ మంజూరు చేయాలని కోరారు. దీనిపై కేంద్ర మంత్రి స్పందిస్తూ చింతపల్లి మత్స్యకారులకు శాశ్వత జెట్టీని మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. మత్స్యకారులు ఉపాధి అవసరాల కోసం వలసలు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే శాశ్వత జెట్టీ ఏర్పాటు చేస్తామన్నారు.

కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖల సహాయమంత్రి ఎల్.మురుగన్ మాట్లాడుతూ మత్స్యసంపద యోజన కింద రూ.20 వేల కోట్లతో మత్స్యకారుల కోసం పలు పథకాలు అమలు చేస్తున్నట్టు చెప్పారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో మత్స్యకారులకు రూ.24 కోట్లతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తున్నామని, అది ప్రస్తుతం టెండరు దశలో వుందన్నారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ మత్స్యకారులు పక్కా ఇళ్లు నిర్మించుకొనేందుకు ఒక పథకం ప్రారంభిస్తే బాగుంటుందని సూచించారు. కార్యక్రమంలో కేంద్ర మత్స్యశాఖ సంయుక్త కార్యదర్శి నీతూ ప్రసాద్, మత్స్యశాఖ డిడి నిర్మలా కుమారి, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, పశుసంవర్ధక శాఖ జెడి విశ్వేశ్వరరావు, డిడి రమణ, తహశీల్దార్ భాస్కరరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు నడికుదిటి ఈశ్వరరావు, శ్రీకాకుళం జిల్లా బిజెపి అధ్యక్షులు బి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చెందిన దేశంగా భారత్

భోగాపురం : 2047 నాటికి భారత దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కేంద్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమ శాఖల సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ అన్నారు. చెరుకుపల్లి గ్రామంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ, జిల్లాలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర మొత్తం 775 గ్రామాలకు గానూ ఇప్పటివరకు 475 గ్రామాల్లో పూర్తి అయ్యిందని తెలిపారు. వైసిపి నాయకులు ఉప్పాడ సూర్యనారాయణ తదితరులు మాట్లాడారు. పలుశాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను కేంద్రమంత్రి తిలకించారు. ఉజ్వలపథకం కింద గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



మత్స్యకార మహిళతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి పర్షోత్తమ్

కేంద్రమంత్రి వద్ద సమస్యలపై ఏకరువు

గ్రామంలో కుళాయిలు లేక తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని, పాఠశాల శిథిలావస్థకు చేరుకుందని చెరుకుపల్లి గ్రామానికి చెందిన మహిళలు కేంద్రమంత్రి మురుగన్ దృష్టికి తీసుకువెళ్లారు. పాఠశాల శిథిలావస్థకు చేరుకుందని, బాలికలు ఉపయోగించు కునేందుకు కనీసం మరుగుదొడ్లు లేవని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన పాఠశాలను పరిశీలించి చిన్నారులు, ఉపాధ్యాయులతో మంత్రి మాట్లాడారు. సమస్యలపై చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ మయుర అశోక్ మంత్రికి తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల బైక్ ర్యాలీ

ప్రభుత్వం స్పందించకుంటే సమ్మె ఉధృతం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సమ్మెలో భాగంగా శనివారం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ధర్నా శిభిరం నుంచి ప్రారంభమైన ర్యాలీ బాలాజీ మార్కెట్, ఎన్‌సిఎస్, గంటస్తంభం, మూడులాంతర్లు, కోట జంక్షన్, అంబేద్కర్ జంక్షన్, ఆర్‌టిసి కాంప్లెక్స్, అర్‌అండ్‌బి, పోలీస్ బారెక్స్ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆ సంఘం జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి.కాంతారావు, సిఆర్‌పి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురువులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చలో విజయవాడ కార్యక్రమాన్ని అణిచివేసే చర్యలను ఖండించారు. అరెస్టులతో ఉద్యమాన్ని, తమ గొంతును నొక్కడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులంతా పాల్గొన్నారు.




బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జాతీయ స్థాయి పురుష, మహిళా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో యూత్ జూనియర్ విభాగంలో వై. చైతన్య కుమారి ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించారు. అరుణాచల్ ప్రదేశ్ ఇటానగర్ రాజీవ్ గాంధీ యునివర్సటీలో గత నెల 28 నుంచి జరుగుతున్న జాతీయ స్థాయి మెన్, ఉమెన్, యూత్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ యూత్, జూనియర్ విభాగం పోటీల్లో జిల్లా కేంద్రం అయ్యన్న పేటకు చెందిన వై. చైతన్య కుమారి శనివారం 81 కిలోల విభాగంలో పాల్గొని స్నాచ్ 78 కిలోలు, క్లీన్ జర్క్ 91 మొత్తం 169కిలోలు బరువెత్తి కాంస్య పతకం సాధించింది. ఇదే పోటీల్లో జూనియర్ విభాగంలో విజయనగరానికి చెందిన రెడ్డి గాయత్రి 87 కిలోల విభాగంలో పాల్గొని స్నాచ్ 74 కిలోలు, క్లీన్ జర్క్ 96 మొత్తం 170 కిలోలు బరువెత్తి రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా చైతన్య కుమారిని జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.లక్ష్మీనారాయణ, స్టేట్ ప్రెసిడెంట్ ఎన్.లక్ష్మీ, సెక్రటరీ దినేష్ బాబు, వెంకట రామయ్య, కోచ్ చల్లా రాము, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.





క్రీడలకు ప్రాధాన్యత : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్రీడాకారులకు తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. రూ.28లక్షలతో అభివృద్ధి చేసిన ఇండోర్ స్టేడియంను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అందిస్తున్న సహకారం వల్ల జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు పతకాలను సొంతం చేసుకుంటున్నారన్నారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర ద్వారా ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీరాముల నాయుడు, వైసిపి నగర అధ్యక్షుడు ఆశపు వేణు, జోనల్ ఇన్చార్జి డాక్టర్ విఎస్ ప్రసాద్, కుసుంబచ్చన్, ఎంకెబి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

10న చంద్రబాబు బహిరంగ సభ

ప్రజాశక్తి-బొబ్బిలి

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ఈనెల 10న బొబ్బిలి రానున్నారు. రాజా కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో నిర్వహిస్తున్న బహిరంగ సభల్లో భాగంగా ఈ సభ జరుగనుంది. ఈమేరకు కోటలో టిడిపి ముఖ్యనేతలంతా శనివారం సమావేశం నిర్వహించారు. అనంతరం బహిరంగ సభ జరగనున్న రాజా కళాశాల మైదానాన్ని మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు, కిమిడి కళా వెంకటరావు, విజయనగరం పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన, ఇతర నాయకులు పరిశీలించారు. బహిరంగ సభను జయప్రదం చేయాలని ప్రజలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



రాజా కళాశాల మైదానాన్ని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

వంగర పోలీస్‌స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి - వంగర

స్థానిక పోలీస్ స్టేషన్‌ను చీపురుపల్లి డిఎస్‌పి శ్రీనివాస చక్రవర్తి శనివారం తనిఖీ చేశారు. ఈ మేరకు నేర విభాగాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో మాట్లాడి విధి నిర్వహణపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజా రూరల్ సిఐ శ్రీనివాస్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి,జనసేనతోనే జీవితాల్లో వెలుగులు


ప్రజాశక్తి- శృంగవరపుకోట

టిడిపి, జనసేన సర్కారుతోనే పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. శనివారం రాత్రి పట్టణంలోని రాంనగర్, పందిరప్పన్న జంక్షన్‌లో టిడిపి విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు రాయవరపు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గొంప కృష్ణ మినీ మేనిఫెస్టోని ప్రజలకు వివరించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ స్వయంగా వెళ్లి వారి బాగోగులను, సమస్యలను అడిగితెలుసు కున్నారు. టిడిపి అధికారంలోకి తీసుకు రావడానికి కార్యకర్తలంతా పనిచేయా లన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంచే చేను మేసిందట!

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వెనుకటి ఓ రైతు తన పొలంలో వేసిన కంచే... చేను మేసేసిందట. అచ్చంగా అలాగే ఉంది విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ధాన్యం కొనుగోలు తీరు. అక్రమాల అడ్డుకట్టకు ఎన్ని నిబంధనలు పెట్టినా వాటిని అమలు చేయాల్సిన పాలకులు, అధికారులే చేతివాటం ప్రదర్శించడం లేదా, చిత్తశుద్ధి లోపించడం వల్ల రైతులు, అటు ప్రభుత్వం (అంటే ప్రజానీకం) మోసపోతునే ఉన్నారని జనం కోడై కూస్తున్నారు. ఏటా విజయనగరం ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో దోపిడీతోపాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని రాజకీయ అండదండలు గల మోతుబారి మిల్లరు పక్కదారిపట్టించి, వాటి బదులు పిడిఎస్ బియ్యం లెక్క చూపిస్తూ ప్రభుత్వానికి పంగనామాలు పెడుతున్న సంగతి తెలిసిందే. ఈ సారి అటువంటి పప్పులేమీ ఉడకబోవని, ధాన్యం క్రయ విక్రయాలకు కఠిన నిబంధనలు విధించామని ప్రభుత్వం ప్రగల్భాలాలు పలికింది. అందుకు తగ్గట్టే ఆసారి గ్రామాల్లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు చేర్చే వాహనాలకు జిపిఎస్ సిస్టమ్ తప్పనిసరి చేసింది. వాహన ఛార్జీలు, కలాసీ ఛార్జీలు మొదలుకుని, గోనె సంచుల వరకు ప్రభుత్వమే భరించేందుకు నిర్ణయించింది. వీటిన్నింటికంటే ముఖ్యంగా ఆర్‌బికె లేదా గ్రామ సచివాలయాలకు అనుసంధానంగా ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ఆన్‌లైన్ పద్ధతిలో మిల్లర్లకు కేటాయింపులు చేసేందుకు నిర్ణయించింది. కానీ, ఎన్ని నిబంధనలు పెడితే మాత్రం ఏం ఉపయోగం. రైతులకు గోనె సంచులను ఇవ్వకుండా, వాహన సదుపాయాలను సమకూర్చకుండా అధికార యంత్రాంగం ఇబ్బందులకు గురిచేయడంతో రైతులు అనివార్యంగా వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. దీన్ని ఆసరా చేసుకున్న వ్యాపారులు క్వింటా సాధారణ రకం రూ.2183, 'ఎ' గ్రేడ్ రూ.2203 ధరకు బదులు రూ.200 తక్కువ ధరకు కొనుగోలు చేసుస్తున్నారు. మరీ ఇంత ఘోరమా అంటూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే గోనె సంచులు, వాహన ఛార్జీలు నష్టపోతున్నారు. తీరా మిల్లుల వద్ద వేసే కాటాల్లో ప్రతి క్వింటాపైనా అదనంగా దాదాపు 10కేజీల చొప్పు లాగేసుకుంటున్నారు. దీంతో, ఎవరికి విక్రయించినా క్వింటాకు రూ.200 నుంచి రూ.250 వరకు నష్టం తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆన్‌లైన్ కేటాయింపులను పక్కనబెట్టి ఆఫ్‌లైన్ కేటాయింపులకు ఇటీవల జిల్లా పరిషత్ వేదికగా నిబంధనలు సడలించడంతో పెద్దపెద్ద మిల్లర్లంతా రాజకీయ పలుకుబడితో పరిమితికి మించి కేటాయించే విధంగా చేసుకుంటున్నారు. దీంతో, తమకు పరిమితంగానే ధాన్యం కేటాయింపులు జరుగుతున్నాయని చిన్న, మధ్యతరగతి మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక మొత్తంలో కేటయింపులు చేసుకునే మిల్లర్లంతా ఎప్పటి మాదిరిగానే తమకు వచ్చిన ధాన్యానికి బదులు పిడిఎఫ్ బియ్యాన్ని లెక్కచూపించి ప్రభుత్వానికి నష్టం చేకూరుస్తున్నారని, ఇందులో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు కూడా ఉన్నారని జనం చర్చించుకుంటున్నారు. ఈ వ్యవహారంలో అధికారులు, పాలకులు పరస్పర అవగాహనతో ముందుకు సాగిస్తున్నారని విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. రైతులకు అండగా నిలబడడంతోపాటు ప్రజాధనాన్ని పరిరక్షించాల్సిన వారే ఈ విధంగా వ్యవహరించడం శోచనీయమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.




మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, తదితరులు

పాటూరు సచివాలయంలో హౌసింగ్ డే

వేపాడ: మండలంలోని పాటూరు గ్రామ సచివాలయం వద్ద జగనన్న హౌసింగ్ డే దినోత్సవాన్ని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనరసింహ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనవరి 31వ తేదీలోగా జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఉమా, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ రాంబాబు, సర్పంచ్ కె వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ కె రమణమూర్తి, ఎంపిటిసి, పంచాయతీ కార్యదర్శి సంధ్య, సచివాలయ సిబ్బంది,పాల్గొన్నారు.

మండల స్థాయి అధికారులతో సమావేశం

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనరసింహం శనివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి ఎంపిడిఒ ఉమా, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జయప్రకాశ్‌కు ఘన నివాళి


విగ్రహానికి పూలమాలవేస్తున్న నాయకులు

బాడంగి: మాజీ ఎమ్మెల్యే తెంటు జయప్రకాశ్ 16వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు మాజీ ఎమ్మెల్యే లక్ష్మునాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబీ నాయన శనివారం ముగడలో ఆయన సమాధి వద్ద ఘన నివాళులర్పించారు. అనంతరం బాడంగిలో జయప్రకాశ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెర్లాం నియోజకవర్గం నుండి వరుసగా ఆరుసార్లు పోటీ చేసి ఐదుసార్లు విజయం సాధించిన జగనన్నాయకుడు జయప్రకాశ్ అని కొనియాడారు. రాష్ట్ర ఎపిఐడిసి సంస్థ ఛైర్మన్‌గా అనేక శాసనసభ కమిటీలకు నేతృత్వం వహించారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, వైస్ ఎంపిపి సింగిరెడ్డి భాస్కర్ రావు, వివిధ మండల నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

కాపులను మోసగించిన జగన్

శృంగవరపుకోట: కాపు కార్పొరేషన్ నిధులు పక్కదారి మళ్లించి కాపులను మోసం చేసిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వబ్బిన సన్యాసినాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దళితులను హత్యలు చేసి డోర్ డెలివరీ చేసే వైసిపి క్రిమినల్ పార్టీకి కాపు, బలిజ సంఘాలు మద్దతు ఇస్తే మాట నేరమవుతుందన్నారు. కాపులకు రిజర్వేషన్లు ఇచ్చేది లేదని ఖరాఖండిగా చెప్పిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని, కాపు కార్పొరేషన్ నిధులు పక్కదారి మళ్లించి కాపులకు ఇచ్చే సంక్షేమ పథకాలను కూడా కార్పొరేషన్ నిధులలో లెక్కలు చూపించి కాపులను మోసం చేసిన వ్యక్తి అని గుర్తు చేశారు. కాపు రిజర్వేషన్ పోరాటాన్ని హింసాత్మకంగా మార్చిన క్రిమినల్ జగన్ రెడ్డి అని, వచ్చే ఎన్నికల్లో వైసిపిని ఓడించి జనసేన, టిడిపి కూటమికి మద్దతు ఇవ్వాలని కోరారు.

చంద్రబాబు సిఎం కావాలని పాదయాత్ర

భోగాపురం: టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని నెల్లూరు జిల్లా బీసీ మైనారిటీ అధ్యక్షులు చింతల అశోక్ పాదయాత్ర చేపట్టారు. దీనిలో భాగంగా ఇచ్ఛాపురం నుండి తిరుపతి వరకు పాదయాత్ర చేస్తున్న ఆయన శనివారం భోగాపురం మండలం పోలిపల్లి గ్రామం వద్దకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ స్వాగతం పలికి ఆయనకు సంఘీభావం తెలిపారు.

గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు

మెరకముడిదాం: పశువులలో వచ్చు గాలికుంటు వ్యాధి నివారణకు రైతులు తప్పనిసరిగా పశువులకు టీకాలు వేయించాలని మెరక ముడిదాం, గర్భాం పశువైద్యాధికారిని సిహెచ్ హైమావతి అన్నారు. మండలంలోని భీమవరం గ్రామ పంచాయతీలో పశుసంవర్ధక సహాయకుల ఆధ్వర్యంలో శనివారం సుమారు 300 పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణకు వాక్సినేషన్ వేశారు. అనంతరం రైతులతో ఆమె మాట్లాడుతూ నాలుగు నెలలు పైబడిన ఆవు పెయ్యలకు దగ్గర నుండి అన్ని పశువులకు టీకాలు వేయించి కోవలసిన బాధ్యత రైతుపై ఉందన్నారు. ఈ టీకాలు వేయడం వల్ల ఆవులు, దూడలు, గేదెలలో మరణాలు శాతాన్ని తగ్గించుకోవచ్చునన్నారు. పశువులలో పాల దిగుబడి తగ్గకుండా రక్షించు కోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఎంపిటిసి, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

8న ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడి పర్యటన

రామభద్రపురం: ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పర్యటన జయప్రదం చేయాలని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ మాదిగ కోరారు. ఆరికతోటలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 8న బొబ్బిలిలో ఈ పర్యటన జరగనుందన్నారు. ఉత్తరాంధ్ర మేధావులు, కార్యకర్తలు, విద్యార్థిని, విద్యార్థులు హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభనుద్దేశించి రాజకీయంగా,ఆర్థికంగా, విద్యా ఉద్యోగ రంగాలలో బలపడటం ఎబిసిడి వర్గీకరణ సాధించే దిశగా పయనించే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై ప్రసంగాలు ఉంటాయన్నారు. భవిష్యత్తు కార్యాచరణ పై బస సభ్యుల అభిప్రాయాలను తీసుకుంటామన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాల కన్వీనర్ పెంకి సుకుమార్, మారిశెట్టి ఆనందరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డు

శృంగవరపుకోట: పట్టణంలోని పందిరప్పన్న జంక్షన్ వద్ద గల గెడ్డ పోరంబోకు భూమిని ఆక్రమించి పునాదులు నిర్మిస్తున్నారన్న సమాచారంతో తహశీల్దార్ శ్రీనివాసరావు శనివారం తన సిబ్బందితో వెళ్లి ఆక్రమణా పునాదులు నిర్మిస్తున్న ప్రభుత్వ గెడ్డ పోరంబోకు భూమిలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకట్రావు, విఆర్‌ఒ రమణ, కన్నయ్య, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీతాలు ఇప్పించాలంటూ వినతి

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఆసుపత్రి శానిటేషన్ సిబ్బందికి బకాయి జీతాలను ఇప్పించాలని సిఐటియు ఆధ్వర్యంలో శనివారం ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ ఆస్పత్రి శానిటేషన్ సిబ్బంది కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారని వారికి బకాయి వేతనాలు చెల్లించడంతో పాటు శానిటేషన్ కార్మికులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆర్థిక సాయం

వేపాడ: మండలంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెలో ఉండటంతో వారికి శనివారం యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులు రావాడ రామసత్యం యూనియన్ తరపున రూ.30,500 ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పిన్నింటి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి ఐమంది జగదీశ్వర్ రావు, కోశాధికారి చిరంజీవిరావు, రండి చల్లంనాయుడు పలు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయాన్ని అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఇసుక ముసుగులో గం'జాయ్'

- బొడ్డవర కేంద్రంగా అక్రమ రవాణా
- మట్టి తరలిస్తున్నట్లు చెప్పి గంజాయి, ఖైనీ, గుట్కా తరలింపు
- కాసుల కక్కుర్తిలో చెక్ పోస్ట్ పోలీసులు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

అధికారం అండతో పాటు పోలీసుల అండదండలు తోడవడంతో చాలా మంది అక్రమార్కులు ఇసుక, మట్టి తరలింపు మాటున గంజాయి, ఖైనీ, గుట్కా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేయాల్సిన పోలీసులు కూడా వత్తాసు పలకడంతో అక్రమ రవాణా మాఫియా వ్యాపారం మూడు పూలు ఆరు కాయలు అన్న చందంగా సాగిపోతుంది. పగటి పూట ప్రభుత్వ విధులు నిర్వర్తిస్తున్న కొంత మంది అధికార యంత్రాంగం చీకటిపడితే అక్రమ రవాణా దారులను వెనుక నుంచి ప్రోత్సహిస్తూ కాసులు పోగేసుకుంటున్నారు. దీంతో మత్తు పదార్థాల తరలింపునకు అడ్డు అదుపూ లేకుండా పోయింది. ఫలితంగా యువత పెడదారిన పడి గంజాయి మత్తులో ఊగుతున్నారు.

మండలంలోని బొడ్డవర కేంద్రంగా ఉన్న ఇసుక మాఫియా రోజురోజుకీ రెచ్చిపోతున్నారు. గోస్తని నది పరివాహక ప్రాంతాలైన చిలకల గెడ్డ, తాటిపూడి కాలువ వంటి ప్రాంతాల నుండి ఇష్టానుసారం ఇసుకను తోడేస్తున్నారు. వాల్టా చట్టాన్ని సైతం అతిక్రమించి భూగర్భ జలాలను దెబ్బతీస్తున్నారు. మట్టి రవాణా విషయానికొస్తే ఇది అనునిత్యం జరిగే ప్రక్రియలా మారిపోయింది. ఇదంతా ఒక ఎత్తయితే రాత్రి వేళల్లో జరిగే ఈ దందాలో జిల్లా సరిహద్దు ప్రాంతమైన బొడ్డవర చెక్ పోస్ట్ దాటి మండలంలోకి ప్రవేశించడంతో ఇసుక, మట్టి రవాణా మాటున గంజాయి, ఖైనీ, గుట్కా తరలిపోతున్నాయి. అటువంటి ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.

మండలానికి సరిహద్దుగా ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని అనంతగిరి మండలం కాశీపట్నం పంచాయతీ గోస్తని నది పరివాహక ప్రాంతాల నుండి మండలంలోని బొడ్డవర ప్రాంతానికి చెందిన ఇసుక వ్యాపారులు ట్రాక్టర్లు, లారీలతో పెద్ద ఎత్తున ప్రతిరోజు రాత్రి వేళల్లో ఇసుక అక్రమ రవాణా


పేరు, గేటు లేని బొడ్డ వర చెక్ పోస్ట్

సాగిస్తున్నారు. అక్కడి నుండి మైదాన ప్రాంతమైన బొడ్డవర, రాజీ పేట, ఎస్ కోట, గంట్యాడ, లక్కవరపుకోట ప్రాంతాలకు పెద్ద ఎత్తున తరలించుకుపోతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం ప్రకారం ఎటువంటి మైనింగ్, ఇసుక తవ్వకాలకు అనుమతులు లేనప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లా నుండి అక్రమంగా ఇసుక, దాని మాటున గంజాయి తరలిపోతున్నా అనంతగిరి పోలీసులు, అధికారులు గానీ పట్టించుకోకపోవడం గమనార్హం. ఇదే అదునుగా అంతర్ జిల్లాల సరిహద్దు అయిన బొడ్డవర ప్రాంతంలోని అధికార పార్టీ నాయకులు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతుంది. దీంతో చెక్ పోస్ట్ పోలీసులు చేసిందేమీ లేక ఒక్కొక్క ఇసుక ట్రాక్టర్ నుంచి రూ.500 వసూలు చేస్తున్నారని, ఒక్కోసారి ఇసుక మాటున గంజాయి కూడా రవాణా అవుతుందని, సుమారు నెల రోజుల కిందట బొడ్డవర నుండి తాటిపూడికి వెళ్లే రహదారిలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పట్టుకున్న గంజాయి ఇసుక మాటున ట్రాక్టర్ ద్వారా తీసుకువచ్చి బోలెరో వాహనంలోకి మార్చి తరలిస్తుండగా దొరికినట్లు తెలిసింది. పైగా ఖైనీ, గుట్కా నియోజకవర్గంలోని ప్రతి దుకాణంలో జోరుగా అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నా గత రెండు మాసాల్లో ఖైనీ, గుట్కాల అక్రమ రవాణా వాహనాలను పట్టుకున్న దాఖలాలే లేకపోవటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక, మట్టి తరలింపు మాటున జరుగుతున్న గంజాయి, గుట్కా, ఖైనీ తరలింపును చెక్ పోస్ట్ వద్దనే నివారించాలని పలువురు కోరుతున్నారు.

బొడ్డవర చెక్ పోస్ట్ పై ప్రత్యేక నిఘా



మండలంలోని బొడ్డవర అంతర్ జిల్లాల చెక్ పోస్ట్ వద్ద రాత్రి వేళల్లో ఇసుక అక్రమ రవాణా అవుతుందన్న సమాచారంతో చెక్ పోస్ట్ పరిసర ప్రాంతాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. చెక్‌పోస్ట్ దాటి మండలంలోకి ప్రవేశించే ఎటువంటి వాహనాన్నైనా తనిఖీ చేయాల్సిందేనని, వాహనానికి సరైన పత్రాలు లేకపోయినా, వాహనంలో ఉన్న లోడుకు సంబంధించి ఖచ్చితమైన ఆధారాలు లేకపోయినా అటువంటి వాహనాలను విడిచిపెట్టకూడదని చెక్ పోస్ట్ పోలీసులకు ఆదేశాలు జారీ చేశాం. వాహనాలు చెక్ పోస్ట్ వరకు రాకుండా మండలంలోకి ప్రవేశించేందుకు గల మరొక మార్గంలో కూడా రాత్రి వేళల్లో గస్తీ కాస్తున్నాం.

జి. లోవరాజు, ఎస్ఐ, ఎస్‌కోట.

మున్సిపల్ కార్యాలయాల ముట్టడి

- ప్రభుత్వం స్పందించకుంటే 8న కలెక్టరేట్ ముట్టడి
- బిఎస్‌పి, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ మద్దతు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, బేసిక్ వేతనంతో పాటు డి.ఎ, హెల్త్ కోసం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన సమ్మె 12వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు పోటీ కార్మికులను పెట్టడం, అరెస్టులు చేయటాన్ని ఖండిస్తూ మున్సిపల్ కార్యాలయాలను కార్మికులు ముట్టడించారు. విజయనగరంలో కార్యాలయం వద్ద కార్మికులంతా బైఠాయించి పోటీ కార్మికులను రాకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు నగర ఉపాధ్యక్షులు రెడ్డి శంకర్రావు, యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు, నాయకులు రాఘవ, మాట్లాడారు. పోటీ కార్మికులను పెట్టడం, అక్రమఅరెస్టులు చేయించడం, బెదిరింపులు, బెంట్లను తొలగిస్తామని బెదిరించడం వంటి విధ్వంస చర్యల ద్వారా సమ్మెను నుంచి వెనక్కి తగ్గేది లేదని తేల్చి చెప్పారు. ప్రభుత్వం ఇదే వైఖరిని కొనసాగిస్తే జనవరి 8 న కలెక్టరేట్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ముట్టడికి బిఎస్‌పి నాయకులు పాండ్రంకి వెంకటరమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాము, వెంకటేష్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు సతీష్ మద్దతు తెలిపారు.

ఎఐటియుసి ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎఐ టియుసి అనుబంధ సంఘం కార్మికులు నగరంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎస్ఆర్ జంక్షన్ నుంచి నగర పాలక సంస్థ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు,అశోక్ మాట్లాడారు. ముఖ్యనేతలు ముందస్తు అరెస్టు

బొబ్బిలి : మున్సిపల్ కార్యాలయాన్ని కాంట్రాక్టు కార్మికులు ముట్టడించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జి.గౌరీష్, మరో ముగ్గురు కార్మికులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టులు నిరసనగా మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. అరెస్ట్ చేసిన నాయకులను విడుదల చేయాలని కోరారు. లేదంటే పోరాటం ఉధృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.


బొబ్బిలి: కార్యాలయం వద్ద బైఠాయించిన కార్మికులు

పోటీ కార్మికుల అడ్డగింత

నెల్లిమర్ల : నగర పంచాయతీ అధికారులు పోటీ కార్మికులను తీసుకు రావడం దుర్మార్గమని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు యుఎస్ రవి కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ అన్నారు. పారిశుధ్య కార్మికులు సమ్మె చేయడంతో శనివారం అధికారులు 15మంది పోటీ కార్మికులను చెత్త సేకరణకు తీసుకొచ్చారు. ఈనేపథ్యంలో కమిషనర్‌ను, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను, సచివాలయం సిబ్బందిని సిఐటియు నాయకులు, కార్మికులు అడ్డుకున్నారు. కొత్త డ్రైవర్‌ను తీసుకువచ్చి బండి తీసే ప్రయత్నం చేయగా, పంచాయతీ కార్మికులు అడ్డుకొని వెనక్కి పంపారు. సమ్మెను విచ్ఛిన్నం చేసే చర్యలను అధికారులు మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బి.రమణ, హరిబాబు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.


నెల్లిమర్ల: నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

రాజాం : స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని కార్మికులు ముట్టడించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తి నాయుడు డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, అనిల్ కుమార్, హరి, కృష్ణ శారద , మరియదాస్, అప్పలరాజు, రమణ,లక్ష్మి,గురువులు తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం : నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

అగ్ని ప్రమాద బాధితునికి సాయం

చీపురుపల్లి: అగ్నికి ఆహుతై సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని మండల వైసిపి నాయకులు ఆపన్న హస్తాన్నందించారు. శుక్రవారం రాత్రి మండలంలో గల గచ్చలవలస గ్రామానికి చెందిన బి. భద్రయ్యకు చెందిన పూరిల్లు కాలి బూడిదయ్యింది. దీంతో సర్వం కోల్పోయిన భద్రయ్య కుటుంబానికి వైసిపి మండల అధ్యక్షులు ఇప్పిలి అనంతం, వైసిపి జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసరావు నిత్యావసర వస్తువులు, కూరగాయలు, వంటపాత్రలు, స్టీల్ సామాన్లను శనివారం అందజేశారు. చీపురుపల్లి తహశీల్దార్ సురేష్ ఒక బియ్యం బస్తా అందజేశారు. భాధిత కుటుంబానికి ప్రభుత్వం నుండి రావాల్సిన నష్ట పరిహారం వచ్చేలా ప్రయత్నం చేస్తామని భద్రయ్య కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జమ్ము సునీల్, ఎంపిటిసి తవుడు, మంగళగిరి శ్రీనివాసరావు, రేవళ్ళ సత్తిబాబు, మార్కెట్ కమిటీ డైరక్టర్ సిమ్మలా అప్పన్న, పిసిని మహేష్, సంకుపాలెం అప్పలనాయుడు, చీపురుపల్లి నియో జకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్స్ ప్రభాత్ కుమార్, మండల సోషల్ మీడియా కన్వీనర్ మొండేటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో వైసిపి సర్పంచ్ చేరిక

తెర్లాం: మండలంలోని డి.గదబవలస ప్రస్తుత వైసిపి సర్పంచ్ జావాన రమేష్ నాయుడు ఆధ్వర్యంలో 250 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. శనివారం వారికి టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబి నాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సర్పంచ్ జావాన రమేష్ నాయుడతో పాటు ఉప సర్పంచ్ వెంపటాపు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ జావాన రామారావు, వార్డు మెంబర్లు కరిమజ్జి చిన్నంనాయుడు, మండల సీతమ్మ, పల్లా జయలక్ష్మి, రేవళ్ల అన్నపూర్ణమ్మ తదితరులున్నారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉన్నాం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

అర్ధరాత్రి అయినా విజయనగరంలో కార్యకర్తల అవసరాలకు తాను, జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అందుబాటులో ఉంటామని, టిడిపిలో అటువంటి వారెవరైనా విజయనగరంలో ఉన్నారా అని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రశ్నించారు. శనివారం స్థానిక ఎఎంసి కార్యాలయం వద్ద పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా చిక్కాల అరుణ, ఆమెతో పాటు 11 మంది డైరెక్టర్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ కష్టపడే కార్యకర్తకు ఈ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. జిల్లా పరిషత్ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం చూస్తున్న ఇటువంటి ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని మరోసారి గెలిపించుకోవాలన్నారు. త్వరలో విశాఖపట్నం, విజయనగరం జంట నగరాలుగా మారే అవకాశం ఉందన్నారు. మన ప్రాంత అభివృద్ధి వైసిపి గెలుపుతోనే సాధ్యమన్నారు. మరోసారి మీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును గెలిపించి జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ సాంబ పార్టీలోకి వచ్చినప్పుడే సముచిత స్థానం కల్పిస్తామని చెప్పామన్నారు. అవకాశం రావడంతో చైర్‌పర్సన్ హోదా ఇచ్చామన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారందరిని గుర్తిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కందుల రఘుబాబు, కెవి సూర్యానారాయణ రాజు, ఎంపిపిలు అంబళ్ల సుధారాణి, మహంతి కళ్యాణి, బంటుపల్లి వాసుదేవరావు, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, నాయకులు జనార్ధనరావు, పుప్పాల లక్ష్మినారాయణ, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనువాసరావు, చనుమల్లు వెంకటరమణ, చిక్కాల సాంబ, సర్పంచులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

నూతన భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలోని బూరిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని, ఆర్‌బికెను, ఇంటింట కుళాయిని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ఇందులో భాగంగా మారుమూల ప్రాంతాలైనప్పటికీ చక్కటి రహదారులు, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్, ఇంటింటి కుళాయి వంటి సౌకర్యాలు కల్పించారన్నారు. ఎన్నికల వేల దొంగ హామీలతో మళ్ళీ ప్రజల ముందుకు పగటి వేషగాళ్ళు వస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మళ్లీ ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నర్సుపల్లి ఉమాలక్ష్మి, మండల నాయకులు గర్భాపు రామారావు, వైస్ ఎంపిపి చెపేన సత్యనారాయణ, ఎఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, సర్పంచ్ బురి మధుసూదన్ రావు, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


నూతన భవనాలను ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్, ఎమ్మెల్యే

వైసిపి నాయకుల పక్క చూపు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అధికార పార్టీ నాయకులు పక్కదారి చూస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన అధికార పార్టీ యువ నాయకులు పార్టీ కోసం ఎంత కష్ట పడినా గుర్తింపు లేకపోవడంతో విసుగు చెంది పక్క పార్టీలోకి వెళ్ళాలని ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. గత ఎమ్మెల్యే ఎన్నికల్లో అధికార పార్టీ గెలిపించడానికి చేతి చమురు వదిలించుకోవడంతో బాటు అన్ని రకాలుగా నష్టం జరిగినా కూడా పార్టీకి కట్టుబడి ఉన్నప్పటికి అధిష్టానం గుర్తించ లేదని యువ నాయకత్వం అసంతృప్తితో రగిలిపోతుంది. అధికార పార్టీ నాయకులమని పేరు తప్ప కనీసం గుర్తింపుకి నోచుకోలేదని ఆవేదన చెందుతున్నట్లు తెలుస్తోంది. మండాలనికి చంపావతి నది అవతల వైపు ఉన్న యువ నాయకుడు ఎమ్మెల్యే తీరుపై అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఆ యువ నాయకుడు పార్టీ మరే ఆలోచనలో ఉన్నట్లు తెలిస్తోంది. ఆయన పార్టీ మారితే ఆ ప్రభావం పక్క గ్రామాలైన అలుగోలు, గుషిణి, చనమల్లుపేట, సతివాడపై పడుతుందని యువ నాయకులంతా ఆయన వెంటే పార్టీ మారిపోయే పరిస్థితి ఉందని చర్చ జరుగుతోంది. ఆయన పార్టీ మారితే ప్రతిపక్షం నుంచి జెడ్‌పిటిసిగా అవకాశం ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జగన్ ప్రభుత్వంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయిందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి కోళ్ల లలిత కుమారి అన్నారు. మండల కేంద్రంలోని అన్న క్యాంటీన్ వద్ద శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 'రా కదిలి రా' అనే కార్యక్రమం ద్వారా ప్రజలను చైతన్యం పరచాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నాల్గున్నరేళ్ల వైసిపి అరాచక పాలనకు స్వస్తి పలకాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్ర రాష్ట్రాన్ని సైకో పాలన నుండి కాపాడేందుకు ప్రతిఒక్కరూ కదలి రావాలని కోరారు. కులం పేరుతో జగన్ మోహన్ రెడ్డి ప్రజలను ప్రాంతాల వారీగా విడగొట్టి మళ్ళీ ముఖ్యమంత్రి కావాలనే అత్యాశతో చూస్తున్నాడని, దీనికి తగిన బుద్ధి చెప్పే రోజులు చాలా దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. పంచాయతీలోని ఆర్థిక సంఘం నిధులు పక్కదారి పట్టించి స్వాహా చేయడంలో జగన్ రెడ్డికి తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, నాయకులు నానిగిరి రమణాజీ, భీశెట్టి అరుణ, బోనంగి జ్యోతి, కోనేదం మల్లేశ్వరరావు, పొట్నూరు అప్పలరాజు, చక్కా కిరణ్ కుమార్, అనకాపల్లి చెల్లయ్య, ధర్మవరం సర్పంచ్ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - రామభద్రపురం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ దశలవారీగా సామాజిక పింఛన్లను 3వేల వరకు పెంచడంతో అవ్వ తాతల కళ్ళల్లో ఆనంద వెల్లువలు కనిపిస్తున్నాయని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతన పింఛన్లను ఆయన చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జన్మభూమి కమిటీలు పెత్తనంతో పింఛన్లు మంజూరు కష్టతరంగా ఉండేదని వైసిపి ప్రభుత్వంలో అలా కాకుండా పార్టీలకతీతంగా పింఛన్లు ఇంటివద్దే అందజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, వైసిపి మండల అధ్యక్షుడు లక్షుంనాయుడు, జెసిఎస్ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, ఎంపిడిఒ, వైసిపి నాయకులు, పాల్గొన్నారు.

గజపతినగరం: పింఛను పెంపుతో లబ్ధిదారులకు మరింత భరోసా కలిగిందని ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక, జెడ్‌పిటిసి గార తవుడు అన్నారు. శనివారం మండలంలోని ముచ్చర్ల, కెంగువ, రంగుపురం పంచాయతీలలో వైసిపి పింఛను పెంపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బెల్లాన త్రినాధ రావు, సర్పంచులు కర్రి లక్ష్మణ, గార సూర్యకుమారి, సూరప్పడు, కెంగువ వైసిపి యువజన నాయకులు లెంక గణేష్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


రామభద్రపురం: పింఛన్లను అందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొండపల్లి: జగనన్న ఇచ్చిన హామీ మేరకు సామాజిక భద్రతా పింఛన్ 3 వేలు రూపాయలు చేయడం ద్వారా అవ్వా తాతలకు సంక్రాంతి పండుగ ముందే వచ్చిందని ఎంపిపి చల్ల చలంనాయుడు అన్నారు. శనివారం మండలంలోని గొట్లాం గ్రామ సచివాలయ ఆవరణంలో నూతన పింఛన్లను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశరావు, పిఎసియస్ అద్యక్షులు మహంతి రమణ, వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నంనాయుడు, ఎంపిడిఒ వైవి.రాజేంద్ర ప్రసాద్, సర్పంచ్ ఆదిలక్ష్మి, ఎంపిటిసి తాళ్ళపూడి అప్పలనాయుడు, సీనియర్ వైసిపి నాయకులు మీసాల తులసీ రావు, మండల రామునాయుడు, గృహ సారధుల మండల కన్వీనర్ పల్లి రఘు, సిడగం నారాయణరావు, గ్రామ కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని జాకేరు, సోంపురం, పాటూరు, బొద్దాం, ఆర్ఎస్‌పేట, పీకేఆర్ పురం, కేజీ పూడి గ్రామ సర్పంచులు బుద్ధ చిన్నమ్మలు, మురిపిండి గంగరాజు, కె వెంకటలక్ష్మి, వై లక్ష్మి, ఎం జగ్గుబాబు, బంగారయ్యలతో కలిసి వైసిపి మండల అధ్యక్షులు జగ్గుబాబు చేతులు మీదుగా శనివారం నూతన పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయా సచివాలయ పరిధిలోగల ఎంపిటిసిలు, సంఘం అధ్యక్షుడు ఎన్‌వి రావు, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

మద్యం విక్రయాలపై దాడులు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి గ్రామానికి చెందిన ఎస్.కుమార్ బెల్ట్ షాపు నడపడంతో 25 మద్యం బాటిల్‌తో పోలీసులకు శనివారం పట్టుబడ్డాడు. ఉంగరాడ మెట్ట నుంచి స్వగ్రామానికి అక్రమంగా 25 మద్యం బాటిళ్ల తీసుకువెళ్ళడంతో పోలీసులు దాడులు జరిపి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. దాడులో ఎస్ఐతో పాటు పోలీసులు శివ, సుధీర్ ఉన్నారు.

48 మద్యం బాటిళ్లు పట్టివేత

నెల్లిమర్ల: బొప్పడాంలో 48 అక్రమ మద్యం బాటిళ్లు పోలీసులు శనివారం దాడులు చేసి పట్టుకున్నారు. ఆ గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. మద్యం బాటిళ్లు, నిందితున్ని పోలీసు స్టేషన్‌కి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో పలువురు పోలీసుల పాల్గొన్నారు.

నాటుసారా, బెల్లపు ఊట ధ్వంసం

కొత్తవలస: మండలంలో నాటు సారాయి పై పలు గ్రామాల్లో కొత్తవలస, ఎస్.కోట సిఐలు వి. చంద్రశేఖర్, ఎస్.బాల సూర్యరావు ఆధ్వర్యంలో శనివారం ఉదయం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కొత్తవలస సీఐ చంద్రశేఖర్ నేతృత్వంలో చిన్న మన్నిపాలెం, అప్పనదరపాలెం శివారు గ్రామాల్లో సిబ్బంది ముమ్మర దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు 200 లీటర్ల బెల్లపు ఊట, సుమారు 100 లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. ఎస్.కోట సిఐ బాలసూర్యారావు నేతృత్వంలో రామలింగపురం, ముసిరం గ్రామాల్లో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో సుమారు 1250 లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్లు సిఐ వివరించారు. ముసిరం గ్రామంలో మద్యం సీసాలు కలిగి ఉన్న వారిపై దాడులు నిర్వహించి పోలీసులు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

44 మద్యం సీసాలు స్వాధీనం

విజయనగరం: విజయనగరం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని అక్రమంగా మద్యం కలిగిన ఒక వ్యక్తిని ద్వారపూడి - గుంకలాం గ్రామాల మధ్య రూరల్ సిఐ టివి తిరుపతిరావు, రూరల్ ఎస్ఐ గణేష్, సిబ్బంది శనివారం పట్టుకున్నారు. అతని వద్ద నుండి 44 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.